సాక్షి ఖమ్మం

బుధవారం, 28, మే, 2025



భయం.. భయం..

ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ ఏసీబీకి పట్టుబడిన నేపథ్యాన డాక్యుమెంట్ రైటర్లు కార్యాలయంలోకి అడుగు పెట్టలేదు. 8లో



జిల్లాలో దంచి కొట్టిన వాన

జిల్లాలో మంగళవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. 8లో

గరిష్టం / కనిష్టం

32° / 26°

వాతావరణం

జిల్లా అంతటా బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పలు ప్రాంతాల్లో ఓ మోస్తరు వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

జిల్లాలో డిప్యూటీ సీఎం పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/ముదిగొండ: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 8గంటలకు ముదిగొండ మండలం యడవల్లిలో రూ.4.75కోట్ల నిధులతో చేపట్టనున్న శ్రీ యోగానంద లక్ష్మీ నరసింహస్వామి ఆలయ రాజగోపురం, ముఖ మండపం, గెస్ట్‌హౌస్, ఆర్చి పునర్నిర్మాణాలకు శంకుస్థాపన చేస్తారు. ఈమేరకు యడవల్లిలో శంకుస్థాపన ఏర్పాట్లను రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు మంగళవారం పరిశీలించారు. కాంగ్రెస్ జిల్లా, మండల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రమేష్‌తో పాటు మందరపు నాగేశ్వరరావు, కందిమళ్ల వీరబాబు పాల్గొన్నారు.

మంత్రి తుమ్మల..

రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. సాయంత్రం 5–30గంటలకు ఖమ్మం 20వ డివిజన్ ప్రకాష్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. అతర్వాత వైరా రోడ్డులోని అంబేద్కర్‌భవన్‌లో ఏర్పాటు చేసిన మహిళామార్ట్‌ను ప్రారంభిస్తారు.

సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు



విత్తనాల పంపిణీని ప్రారంభిస్తున్న డీఏఓ పుల్లయ్య, సొసైటీ బాధ్యులు

రఘునాథపాలెం: భూసారాన్ని పెంచేందుకు ఉపయోగపడే పచ్చిరొట్ట విత్తనాలను సబ్సిడీపై ఇస్తున్నందున రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి డి.పుల్లయ్య సూచించారు. రఘునాథపాలెం మండలంలోని వీ.వీ.పాలెం సొసైటీలో మంగళవారం పలువురికి విత్తనాలు అందజేశాక ఆయన మాట్లాడారు. ఈ విత్తనాలతో పంట సాగు చేసి కలియదున్నడం ద్వారా మెరుగైన ఫలితాలు వస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ రావూరి సైదబాబు, ఏఓ ఉమామహేశ్వరరెడ్డి, ఏఈఓ లు సాయిశిరణ్మయి, దివ్య, సీఈఓ ఐతగాని తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మహిళా క్లినిక్‌లో మెరుగైన సేవలు



ఉద్యోగులతో సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మంవైద్యవిభాగం: మహిళా ఆరోగ్య క్లినిక్ ద్వారా మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయని డీఎంహెచ్‌ఓ బి.కళావతి బాయి తెలిపారు. ఖమ్మం పాత మున్సిపాలిటీ కార్యాలయంలోని క్లినిక్‌ను మంగళవారం సందర్శించిన ఆమె ఓపీ సేవలు, మందుల లభ్యతపై ఆరా తీశారు. అనంతరం డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ జిల్లాలోని పీహెచ్‌సీలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా రిఫర్ చేసే వారికి ప్రతీ మంగళవారం పరీక్షిస్తూ చికిత్స చేస్తున్నట్లు తెలిపారు. ఈ విషయంలో వైద్యులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, మహిళలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం పల్లె దవాఖానా, కోర్టు సముదాయంలోని ప్రభుత్వ డిస్పెన్సరీ కూడా డీఎంహెచ్‌ఓ తనిఖీ చేశారు.

మన కోసం.. మన ఉత్పత్తులు!

- ఎస్‌హెచ్‌జీ సభ్యుల సామగ్రి అమ్మకానికి వేదిక
- కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చొరవతో సిద్ధమైన మహిళా మార్ట్
- నేడు ప్రారంభించనున్న మంత్రి తుమ్మల
- దశలవారీగా ఇతర మున్సిపాలిటీలకూ విస్తరణ

ఖమ్మంమయూరిసెంటర్: మహిళా సంఘాల సభ్యులు తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా ఖమ్మంలో మహిళా మార్ట్ సిద్ధమైంది. ఇన్నాళ్లు ఉత్పత్తులు రూపొందిస్తున్నా అమ్మకానికి సరైన వేదిక కానరాక.. అవగాహన లేక మహిళలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నాణ్యమైన, ఆరోగ్యవంతమైన ఉత్పత్తులు అయినప్పటికీ డిమాండ్ మేర విక్రయించుకోలేకపోయారు. ఈ విషయాన్ని గమనించిన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ప్రత్యేకంగా మహిళా మార్ట్ ఏర్పాటుకు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా మార్ట్ సిద్ధం కాగా.. బుధవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు.

ఉత్పత్తులకు బ్రాండింగ్

ఎంత నాణ్యమైన, ఆర్గానిక్ ఉత్పత్తులైనా విక్రయించాలంటే బ్రాండ్ పేరు కావాలి. ఈమేరకు మహిళామార్ట్‌లో అమ్మే ఉత్పత్తులకు 'మేడిన్ ఖమ్మం..ఫర్ ఖమ్మం' పేరుతో బ్రాండ్ రూపొందించారు. ఇక్కడ అమ్మే వస్తువులన్నింటినీ ఇదే బ్రాండ్‌తో ఆకర్షణీయంగా ప్యాకింగ్ చేయించారు. కాగా, మార్ట్ నిర్వహణ విజయవంతంగా సాగాలనే భావనతో ఉత్పత్తులు నాణ్యతగా ఉన్న 20 సంఘాలను తొలిదశలో ఎంపిక చేశారు. పప్పులు, బియ్యం, కారం, పసుపు, తృణధాన్యాలతో చేసిన చిరుతిండ్లు, ఫినాయిల్, జూట్ బ్యాగ్‌లు, కాళ్ల పట్టాలు సహా పలు సరుకులను విక్రయానికి సిద్ధం చేశారు. అలాగే, మార్ట్ నిర్వహణ కోసం ఐదుగురికి శిక్షణ ఇప్పించారు. ఇదే బ్రాండింగ్‌తో అమెజాన్, ఫ్లిప్‌కార్ట్ వంటి ఆన్‌లైన్ సంస్థల ద్వారా విక్రయానికి సంప్రదింపులు మొదలుపెట్టినట్లు తెలిసింది. అంతేకాక ఖమ్మంలో ఏర్పాటుచేస్తున్న మహిళా మార్ట్ నిర్వహణ గాడిన పడగానే మధిర, సత్తుపల్లి, వైరా, ఏదులాపురం మున్సిపాలిటీల పరిధిలోనూ ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.





ఖమ్మంలో ప్రారంభానికి సిద్ధమైన మహిళా మార్ట్ (ఇన్‌సెట్) మార్ట్‌లో విక్రయానికి సిద్ధంగా వస్తువులు

నష్టం ఎదురుకావొద్దనే...

జిల్లాలో అధికారులతో కలిసి పర్యటించిన సమయంలోనే కాక గవర్నర్ వచ్చినప్పుడు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను పరిశీలించామని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. కానీ సరైన మార్కెటింగ్ సదుపాయం లేక మద్దతు ధర దక్కడం లేదని గుర్తించినట్లు చెప్పారు. మహిళామార్ట్ ప్రారంభ ఏర్పాట్లను మంగళవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. మహిళలు రూపొందించిన ఉత్పత్తులకు సరైన మార్కెటింగ్ సదుపాయం కల్పించాలనే ప్రయత్నంలో భాగంగానే రెండు నెలల్లో భవనాన్ని సిద్ధం చేశామని తెలిపారు. ఖమ్మంలో రద్దీ దృష్ట్యా మొదటి మార్ట్ ఇక్కడ ఏర్పాటు చేశామని, దశలవారీగా మిగిలిన మున్సిపాలిటీల్లో తెరుస్తామని చెప్పారు.

మార్కెటింగ్ లేక..

మహిళా సంఘాల సభ్యులు నాణ్యమైన ఉత్పత్తులను తయారు చేస్తున్నా సరైన మార్కెటింగ్ లేక నష్టపోతున్నారు. దీంతో సొంతంగా కొన్ని షాపులకు సరఫరా చేయడం లేదా వారాంతపు సంతల్లో విక్రయిస్తున్నారు. తద్వారా శ్రమకు తగిన ఫలితం లభించడం లేదు. కొనుగోలుకు వ్యాపారులు ముందుకొస్తున్నా తక్కువ ధరే లభిస్తుండడంతో నష్టం ఎదురవుతోంది. ఈ నేపథ్యాన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఈ ఉత్పత్తులను పరిశీలించి మార్కెటింగ్ లేదనే విషయాన్ని గమనించారు. దీంతో సూపర్‌మార్కెట్ తరహాలో మహిళామార్ట్ ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఖమ్మం వైరా రోడ్డులోని జలాంజనేయ స్వామి గుడి పక్కన మెయిన్‌రోడ్డుపై ఎస్సీ కార్పొరేషన్ పాత భవనాన్ని రూ.30 లక్షలతో ఆధునీకీకరించారు. సూపర్‌మార్కెట్‌కు అనుగుణంగా తీర్చిదిద్దారు.

పథకాల అమలులో మీరే కీలకం



డెయిరీ ఏర్పాట్లపై సమీక్షిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

- ఇందిరమ్మ లబ్ధిదారులకు ఉచిత ఇసుక
- నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్ నమోదు చేయండి
- వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం రేవంత్‌రెడ్డి

ఖమ్మం సహకారనగర్: ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలు, పథకాల అమలులో కలెక్టర్లు కీలకంగా వ్యవహరిస్తూ అర్హులకు లబ్ధి జరిగేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావుతో కలిసి హైదరాబాద్ నుంచి మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై సమీక్షించారు. ఈసందర్భంగా సీఎం మాట్లాడుతూ గత ఏడాది కంటే ఎక్కువ ధాన్యాన్ని తక్కువ సమయంలో సేకరించడంపై అభినందించారు. పైలట్ మండలాల్లో రెవెన్యూ సదస్సుల నిర్వహణతో వచ్చిన అనుభవం ఆధారంగా జూన్ 3నుంచి అన్ని మండలాల్లో భూ భారతి సదస్సులు నిర్వహించాలని సూచించారు. అలాగే, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు టోకెన్ల ద్వారా ఉచితంగా ఇసుక సరఫరా చేయాలని తెలిపారు. కాగా, నకిలీ విత్తనాల జాడ లేకుండా చూడడంతో పాటు ఎవరైనా అమ్మితే పీడీ యాక్ట్ అమలుచేయాలని ఆదేశించారు. ఈ వీసీకి జిల్లా నుంచి కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి.శ్రీజ, పి.శ్రీనివాసరెడ్డితో పాటు వివిధ శాఖల అధికారులు సన్యాసయ్య, శ్రీలత, చందన్‌కుమార్, భూక్యా శ్రీనివాస్, పుల్లయ్య, రాజేశ్వరి, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

- జిల్లాలోని భవిత కేంద్రాలను ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ పి.శ్రీజతో కలిసి సమీక్షించిన ఆయన మాట్లాడుతూ రానున్న ఇరవై రోజుల్లోగా జిల్లాలోని కేంద్రాల్లో టాయిలెట్లు, వాష్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే, ఆకర్షణీయంగా పెయింటింగ్ వేయించాలని తెలిపారు. డీఈఓ సత్యనారాయణ, సీఎంఓ రాజశేఖర్ పాల్గొన్నారు.
- బాలికల సంరక్షణలో ఉపాధ్యాయులు కీలకంగా వ్యవహరించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మం రిక్కాబజార్ హైస్కూల్‌లో స్కూల్ అసిస్టెంట్లకు బాలికల రక్షణ, హ్యూమన్ ట్రాఫికింగ్‌పై ఏర్పాటుచేసిన శిక్షణలో ఆయన మాట్లాడారు. అనుమానితుల గుర్తింపు, వ్యక్తిగత భద్రతపై బాలికలకు అవగాహన కల్పించాలని, అవసరమైనప్పుడు అండగా నిలవాలని సూచించారు. డీఈఓ ఎస్.సత్యనారాయణ, జీసీడీఓ తులసి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరా మహిళా డెయిరీ కార్యాచరణ వేగవంతం చేయాలి

- ఖమ్మంమయూరిసెంటర్: ఇందిరా మహిళా డెయిరీ ఏర్పాటు కార్యాచరణలో వేగం పెంచాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఆయన ఇందిరా మహిళా డెయిరీ, రాజీవ్ యువ వికాసం, మహిళా మార్ట్ ప్రారంభోత్సవంపై అధికారులతో సమీక్షించి సూచనలు చేశారు. మహిళా డెయిరీ లబ్ధిదారులను ఎంపిక చేసి పశుగ్రాసం పెంపకం, యూనిట్ల కొనుగోలుకు సిద్ధం చేయాలని తెలిపారు. అలాగే, రాజీవ్ యువ వికాసం లబ్ధిదారుల వివరాలను కార్పొరేషన్, బ్యాంకుల వారీగా విభజించాలని చెప్పారు. ఇప్పటివరకు 7,722ప్రతిపాదనలు బ్యాంకులకు పంపగా 5,183 దరఖాస్తులకు సమ్మతి అందిందని తెలిపారు. వివిధ శాఖల అధికారులు ఎస్.సన్యాసయ్య, నవీన్‌బాబు, అలీమ్, జ్యోతి, పుల్లయ్య, విజయ లక్ష్మి, శ్రీనివాసరెడ్డి, మధుసూదన్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ పురంధర్ పాల్గొన్నారు.

ఆటోమేషన్‌లో సబ్‌స్టేషన్ల నిర్వహణ

- రియల్ టైం మేనేజ్‌మెంట్ విధానం అమలు
- ఎన్పీడీసీఎల్ పరిధిలోని 100 సబ్‌స్టేషన్లలో శ్రీకారం
- జానకీపురంలో ఆవిష్కరణకు సిద్ధం



ఆటోమేషన్ విధానం అమలుకానున్న జానకీపురం సబ్ స్టేషన్

ఖమ్మంవ్యవసాయం: విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్వహణలో సమూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. మానవ రహితంగా నిర్వహించేలా సరికొత్త సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఆటోమేషన్ విధానం అమలుకు ఎన్పీడీసీఎల్(నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ) శ్రీకారం చుట్టింది. ఇప్పటికే దేశంలోని బెంగళూరు, ఢిల్లీ, ముంబై వంటి నగరాల్లో ఆటోమేషన్ ఆఫ్ సబ్ స్టేషన్ల(స్వయం చలిత విద్యుత్ ఉప కేంద్రాలు) నిర్వహణ అమలవుతోంది. ఈ విధానాన్ని ఎన్పీడీసీఎల్ 33/11 కేవీ సబ్ స్టేషన్లలో అమలు చేయాలని నిర్ణయించింది. సంస్థ పరిధిలోని 16 జిల్లాల్లో మొత్తం 1,516 సబ్ స్టేషన్లు ఉండగా తొలుత 100 సబ్ స్టేషన్లలో సరికొత్త విధానం అమలుకు రూ.26.32 కోట్లు వెచ్చిస్తున్నారు. తొలిదఫా జిల్లాలోని 38 సబ్ స్టేషన్లలో ఆటోమేషన్ విధానం అమల్లోకి రానుంది.

రియల్ టైం మేనేజ్‌మెంట్ విధానం

సబ్ స్టేషన్ల ఆటోమేషన్‌కు 'రియల్ టైం ఫీడర్ మేనేజ్‌మెంట్ సిస్టం' అమలు చేస్తారు. ఇందులో భాగంగా 11 కేవీ విద్యుత్ సరఫరా ఫీడర్ల ఆన్ – ఆఫ్‌ను ఎలక్ట్రానిక్, కమ్యూనికేషన్ వ్యవస్థలతో అనుసంధానిస్తారు. తద్వారా సిబ్బంది అవసరం లేకుండా ఎక్కడి నుంచైనా ఆపరేట్ చేసే అవకాశం ఏర్పడుతుంది. సబ్ స్టేషన్‌కు సంబంధించి సరఫరా, అంతరాయాలు, ఇతర సాంకేతిక విషయాలను కంపెనీ హెడ్ క్వార్టర్‌లోని కంట్రోల్ రూమ్, సంబంధిత అధికారుల సెల్ ఫోన్లకు ఎప్పటికప్పుడు సమాచారం చేరుతుంది. తద్వారా ఎక్కడైనా ఇబ్బంది ఎదురైతే తక్షణమే తెలుసుకుని.. మరమ్మతు అనంతరం పునరుద్ధరించే అవకాశముంది. ఫలితంగా ఎక్కువ సేపు అంతరాయాలు ఉండకుండా, నాణ్యమైన విద్యుత్ అందుతుందని చెబుతున్నారు. నమ్మకమైన, నిజమైన సరఫరా వివరాలు తెలియనుండడంతో నెట్ వర్క్‌ను మరింత మెరుగ్గా అభివృద్ధి చేసుకోవడం వీలవుతుంది.

జానకీపురంలో ఫస్ట్

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గం బోనకల్ మండలంలోని జానకీపురం సబ్ స్టేషన్‌లో ఆటోమేషన్ విధానాన్ని తొలిసారి అందుబాటులోకి తీసుకొస్తున్నారు. ఈ విధానం అమలులో ఖమ్మం జిల్లాకు డిస్కం ప్రాధాన్యత ఇచ్చిందని, క్రమంగా నిర్దేశించిన 38 సబ్‌స్టేషన్లలో అమలు చేయనున్నామని ఖమ్మం ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి మంగళవారం వెల్లడించారు.

క్లుప్తంగా

అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు డాక్టరేట్


కిరణ్‌కుమార్

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ఫిజిక్స్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ కె.కిరణ్‌కుమార్‌కు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఓయూ ప్రొఫెసర్ కె.సాధన పర్యవేక్షణలో ఆయన 'స్ట్రక్చరల్ ఆప్టికల్ స్పెక్ట్రోస్కోపిక్ ప్రాపర్టీస్ ఆఫ్ డోప్డ్ జింక్ అల్యూమినేట్ ఫర్ ఎలక్ట్రో కెమికల్ అప్లికేషన్స్' అంశంపై పరిశోధనాత్మక సిద్ధాంత గ్రంథాన్ని సమర్పించగా డాక్టరేట్ ప్రకటించారు. ఈసందర్భంగా కిరణ్‌కుమార్‌ను కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా, వివిధ విభాగాల బాధ్యులు ఎం.ప్రసాద్, బి.అనిత, డాక్టర్ బి.శ్రీనివాస్, ఎస్.రాంబాబు, రాజశేఖర్, ధర్మయ్య మంగళవారం అభినందించారు.

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ఖమ్మం సహకారనగర్: పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్వో) పద్మశ్రీ సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆమె పరీక్ష నిర్వహణపై అధికారులతో సమీక్షించారు. వచ్చే నెల 3నుంచి 11వ తేదీ వరకు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరగనుండగా, 1,048 మంది విద్యార్థుల కోసం ఖమ్మంలో మూడు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. పరీక్షకు రెండు రోజుల ముందు వరకు కూడా రూ.50జరిమానాతో ఫీజు చెల్లించే అవకాశమున్న విషయమై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డీఈఓ సత్యనారాయణ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ కారుమంచి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 22న ప్రారంభం కాగా మంగళవారం ముగిశాయి. ప్రథమ సంవత్సరం విద్యార్థులు 27,775 మందికి 25,972మంది, ద్వితీయ సంవత్సరంలో 6,514మందికి 6,148మంది విద్యార్థులు హాజరయ్యారని జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు.

రేపటి నుంచి మూల్యాంకనం

ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షల జవాబుపత్రాల మూల్యాంకనం ఈనెల 29 నుంచి జూన్ 1వ తేదీ వరకు చేపట్టనున్నారు. మొదటి విడత 29న, రెండో విడత ఈనెల 31 న మొదలవుతుంది. జిల్లాకు ఇప్పటికే 69,835 జవాబుపత్రాలు చేరాయని డీఈఓ రవిబాబు తెలిపారు. ఈమేరకు వాల్యుయేషన్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయన వెల్లడించారు.

కొత్త వ్యవసాయ మార్కెట్ ఏర్పాటుకు శ్రీకారం

చింతకాని: చింతకాని, ముదిగొండ మండలాల రైతులకు సేవలందించేలా నూతన మార్కెట్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా చింతకాని మండలం మత్కేపల్లి పరిధి 41వ సర్వేనంబర్‌లో భూసేకరణకు మార్కెటింగ్, రెవెన్యూ అధికారులు మంగళవారం సంయుక్తంగా సర్వే చేపట్టారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆదేశాలతో జిల్లా మార్కెటింగ్ అధికారి అలీమ్, మార్కెట్ సహాయకార్యదర్శి వీరాంజనేయులు, సర్వేయర్ నవీన్ సర్వేలో పాల్గొన్నారు. ఇక్కడ మార్కెట్ ఏర్పాటైతే రెండు మండలాల రైతులకు దూరాభారం తప్పడమే కాక పంట ఉత్పత్తులకు మద్దతు ధర లభిస్తుందని చెబుతున్నారు.

ఏసీబీ దాడులతో భయం.. భయం

- సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అంతా గప్‌చుప్
- కార్యాలయం ముఖమే చూడని డాక్యుమెంట్ రైటర్లు


కార్యాలయం పైఅంతస్తులో మూతపడిన డాక్యుమెంట్ రైటర్ల షాప్‌లు

ఖమ్మంరూరల్: ఖమ్మం రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ పని జరగాలన్నా డబ్బు ముట్ట చెప్పాల్సిందేనన్న ఆరోపణలు ఏళ్లుగా ఉన్నాయి. కొందరు అడిగినంత ఇచ్చి పని చేయించుకుంటుండగా.. ఇంకొందరు ఏం చేయాలో పాలుపోని పరిస్థితులు ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యాన ఓ బాధితుడు చేసిన ఫిర్యాదుతో సోమవారం తనిఖీలు చేపట్టిన ఏసీబీ అధికారులు డాక్యుమెంట్ రైటర్ పి.వెంకటేష్ ద్వారా రూ.30వేల లంచం తీసుకుంటున్న సబ్ రిజిస్ట్రార్ జె.అరుణను అదుపులోకి తీసుకున్న విషయం విదితమే. ఈ ఘటనతో మంగళవారం కార్యాలయమంతా బోసిపోయి కనిపించింది. ఉద్యోగులు భయం భయంగానే విధులు నిర్వర్తించగా సాధారణ రోజుల్లో పోలిస్తే తక్కువగనాప రిజిస్ట్రేషన్లు పూర్తయ్యాయి. సబ్ రిజిస్ట్రార్ అరుణను ఏసీబీ అధికారులు అదుపులోకి తీసుకోవడంతో ఇన్‌చార్జ్ బాధ్యులు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ భూపాల్‌కు అప్పగించారు.

తెరుచుకోని దుకాణాలు

రూరల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి ప్రజలు నేరుగా వెళ్తే ఏ పని జరగదనే అపవాదు ఉంది. ఇదే సమయాన డాక్యుమెంట్ రైటర్లను ఆశ్రయించి వారి చెప్పిన నగదు ముట్టచెబితే పనులు చకచకా సాగుతాయని చెబుతున్నారు. తాజాగా ఏసీబీకి పట్టుబడిన సబ్ రిజిస్ట్రార్ సైతం డాక్యుమెంట్ రైటర్ సాయంతోనే లంచం తీసుకుంటూ పట్టుబడింది. దీంతో మంగళవారం కార్యాలయం పై అంతస్తుతో పాటు చుట్టుపక్కల ఉన్న డాక్యుమెంట్ రైటర్లు తమ షాపులను తెరవలేదు. అంతేకాక ఎవరు కూడా కార్యాలయంలోకి అడుగు పెట్టే సాహసం చేయలేదు. దూరదూరంగా తిరుగుతూ కార్యాలయంలో ఎవరైనా తనిఖీలకు వచ్చారా అంటూ ఆరా తీయడం కనిపించింది. ఇక కార్యాలయ ఉద్యోగులు సైతం నేరుగా వచ్చిన వారికే రిజిస్ట్రేషన్లు చకచకా పూర్తిచేయడంతో ప్రతిరోజు ఇలాగే చేస్తే బాగుండనే అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఈ విషయమై ఇన్‌చార్జ్ సబ్ రిజిస్ట్రార్ భూపాల్‌ను వివరణ కోరగా మొత్తం 14మందికి నిబంధనల మేరకు రిజిస్ట్రేషన్లు పూర్తిచేసినట్లు తెలిపారు. ఇక సబ్ రిజిస్ట్రార్ జె.అరుణను అదుపులోకి తీసుకున్న ఏసీబీ అధికారులు పలు విషయాలపై విచారణ చేసినట్లు తెలిసింది. అంతేకాక లావాదేవీలకు సంబంధించిన కొన్ని డాక్యుమెంట్లు, ఇతర రికార్డులు స్వాధీనం చేసుకున్నారని సమాచారం.

'ఇందిరమ్మ' పథకంతో పేదలకు మేలు


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

కూసుమంచి: ఇందిరమ్మ గృహ పథకంలో మేలు జరగనున్నందున సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ సూచించారు. కూసుమంచి మండలం గైగోళ్లపల్లిలో మంగళవారం లబ్ధిదారులకు ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. లబ్ధిదారులకు విడతల వారీగా రూ.5లక్షల నిధులు అందనున్నందున నిర్ణీత నమూనాలో ఇల్లు నిర్మించుకుంటే ఫలితం ఉంటుందని చెప్పారు. కాగా, గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీల బాధ్యులు అర్హులకు మాత్రమే ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. ఇంకా ఈ సమావేశంలో హౌజింగ్ పీడీ బి.శ్రీనివాస్, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఏఈ రవి తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో దంచికొట్టిన వాన

నైరుతి రుతుపవనాల ప్రభావం


తల్లాడలో ప్రధాన రహదారిపై ప్రవహిస్తున్న వరద నీరు

ఖమ్మంవ్యవసాయం: నైరుతి రుతుపవనాలు, ఉపరితల ఆవర్తనం ప్రభావంతో జిల్లాలోని పలు ప్రాంతాల్లో మంగళవారం రాత్రి 7గంటల నుంచి వర్షం కురిసింది. పగలంతా ఆకాశం మేఘావృతమై ఉండగా, సాయంత్రం దాటాక ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం మొదలైంది. రాత్రి 8 గంటల సమయానికి వాతావరణ శాఖ వెల్లడించిన నివేదిక ఆధారంగా ఖమ్మం రూరల్ మండలం పల్లెగూడెంలో అత్యధికంగా 62.5 మి.మీ.ల వర్షపాతం నమోదైంది. అలాగే, పెద్దగోపతిలో 57, తిరుమలాయపాలెంలో 37.8, రఘునాథపాలెంలో 36.5, ఖమ్మం ప్రకాష్‌నగర్‌లో 36, చింతకానిలో 22.5, ఖమ్మం కలెక్టరేట్ వద్ద, సదాశివునిపాలెంలో 15.8, గంగారంలో 14.3 మి.మీ. వర్షపాతం నమోదైందని వెల్లడించారు. అంతేకాక మిగతా ప్రాంతాల్లోనూ రాత్రి పొద్దుపోయే వర్షం కురిసింది. ఈ వర్షం రైతులు దుక్కులు సిద్ధం చేసుకోవడానికి దోహదపడనుంది. కాగా, వర్షంతో ఖమ్మంలోని గాంధీచౌక్, కమాన్‌బజార్, పాత బస్టాండ్, వైరా రోడ్డు, కస్బాబజార్ తదితర ప్రాంతాల్లో డ్రెయిన్లు నిండి రహదారులపైకి మురుగునీరు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు.

'శక్తివంతమైన నాయకుడు నెహ్రూ'


నెహ్రూ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఖమ్మంవన్‌టౌన్: దేశ తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ భారత రాజకీయాల్లో శక్తివంతమైన నాయకుడిగా నిలిచారని కాంగ్రెస్ జిల్లాఅధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు తెలిపారు. నెహ్రూవర్ధంతి సందర్భంగా ఖమ్మంలోని కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పంచవర్ష ప్రణాళికలకు శ్రీకారం చుట్టడమే కాక ముందుచూపుతో సాగునీటిపారుదలకు కాల్వలు, ఆనకట్టల నిర్మాణానికి నెహ్రూ శ్రీకారం చుట్టారని తెలిపారు. నాయకులు, కార్పొరేటర్లు పోట్ల నాగేశ్వరరావు, నాగండ్ల దీపక్‌చౌదరి, దొబ్బల సౌజన్య, కన్నం ప్రసన్నకృష్ణ, సాయికుమార్, సయ్యద్ ముజాహిద్ హుస్సేన్, సయ్యద్ గౌస్, ఎర్రం బాలగంగాధర తిలక్, మొక్కా శేఖర్‌గౌడ్, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులు, రాపర్తి శరత్, పల్లెబోయిన భారతీచంద్రం, పాలకుర్తి నాగేశ్వరరావు, యూసఫ్, కమతం రామకృష్ణ, బోడ శ్రావణ్, చంద్రిక, సమీరా, లక్ష్మి, జ్యోతి, కొత్తపల్లి పుష్ప పాల్గొన్నారు.

పలువురు ఎస్‌ఐల బదిలీ

ఖమ్మంక్రైం: జిల్లాలోని వివిధ స్టేషన్లలో విధులు నిర్వర్తిస్తున్న పలువురు ఎస్‌ఐల బదిలీ జరిగింది. అలాగే, వీఆర్‌ఎస్‌లో ఉన్న కొందరికి పోస్టింగ్ ఇస్తూ పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కె.వెంకటకృష్ణ	ఖమ్మం సీసీఎస్	తల్లాడ
బి.కొండల్‌రావు	తల్లాడ	ఖమ్మం త్రీటౌన్
టి.కవిత	సత్తుపల్లి	వేంసూరు
ఎస్.వీరప్రసాద్	వేంసూరు	ఖమ్మం టాస్క్‌ఫోర్స్
ఎం.రవి	సీసీఆర్‌బీ	చింతకాని
ఎస్.కే.నాగుల్‌మీరా	చింతకాని	సీసీఆర్‌బీ
కె.మధుబాబు	వీఆర్	ఖానాపురం హవేలీ
పి.వెంకటేష్	వీఆర్	ఖమ్మం టూటౌన్

'సాక్షి' కార్యాలయంలో నిధి ఆప్‌కే నికట్


మాట్లాడుతున్న రెహానా సుల్తానా

కొణిజర్ల: కొణిజర్ల మండలం తనికెళ్లలోని 'సాక్షి' కార్యాలయంలో ఈఎస్‌ఐ, ఈపీఎఫ్ ఆధ్వర్యాన ఉద్యోగులకు అవగాహన కల్పించేందుకు మంగళవారం 'నిధి ఆప్‌కే నికట్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈఎస్‌ఐ, ఈపీఎఫ్‌పై ఉద్యోగుల సందేహాలను అధికారులు నివృత్తి చేయడమే కాక ప్రయోజనాలను వివరించారు. జిల్లా నోడల్ ఆఫీసర్ బి.నాగులు, సూపర్‌వైజర్ కె.నాగేశ్వరరావు, ఈఎస్‌ఐ బ్రాంచ్ ఇన్‌చార్జ్ మేనేజర్ రెహానా సుల్తానా, ఉద్యోగి బి.కార్తీక్‌తో పాటు సాక్షి బ్రాంచ్ మేనేజర్ జి.మోహనకృష్ణ, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డుప్రమాదంలో యువకుడు మృతి

సత్తుపల్లిరూరల్: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన సత్తుపల్లి మండలం బేతుపల్లిలో సోమవారం రాత్రి చోటు చేసుకుంది. సత్తుపల్లి సరస్వతి ఆలయం ఎదురుగా డబుల్ బెడ్‌రూం కాలనీలో నివాసముంటున్న పాశం కల్యాణ్(28) ప్రభుత్వాస్పత్రిలో కాంట్రాక్టు సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఆయన సోమవారం రాత్రి సత్తుపల్లి నుంచి గంగారం వైపు బైక్‌పై వెళ్తుండగా బేతుపల్లి వద్ద ఎదురుగా వచ్చిన ఐషర్ వాహనం ఢీ కొట్టింది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన కల్యాణ్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం ఖమ్మంకు తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు.

చికిత్స పొందుతున్న యువకుడు..

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నేకల్ వద్ద రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. సింగరేణి మండలం చందర్లగూడెంకు చెందిన అజ్మీరా సునీల్‌కుమార్(28) ఈనెల 23న సూర్యాపేట వైపు నుండి ఖమ్మం వైపు ద్విచక్రవాహనంపై వస్తుండగా పొన్నేకల్ మసీదు మూలమలుపు వద్ద రోడ్డు పక్కన రాళ్లను ఢీకొట్టడంతో తీవ్రగాయాలయ్యాయి. దీంతో ఆయనను ఖమ్మంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడని సీఐ ముష్క రాజు తెలిపారు.

మనోవేదనతో వృద్ధుడి ఆత్మహత్య

రఘునాథపాలెం: కుమారుడు ఇంటికి రావడం లేదనే మనోవేదనతో ఓ వృద్ధుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్ వెల్లడించిన వివరాలు.. రఘునాథపాలెంకు చెందిన సుగ్గల రాఘవయ్య(70) వ్యాపారం చేయగా, అనారోగ్యంతో ఇప్పుడు ఇంటికే పరిమితమయ్యాడు. ఆయన చిన్నకుమారుడు శంకర్‌కు వివాహం కాకపోగా ఇంటి నుంచి వెళ్లిపోయిన ఆయన తిరిగి రాలేదు. దీంతో మనోవేదనకు లోనైన రాఘవయ్య ఈనెల 25న నివాసంలో ఉరి వేసుకోగా, కాసేపటికి గమనించిన కుటుంబీకులు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మృతి చెందాడు.

రెండు షాపుల్లో చోరీ

మధిర: మండలంలోని నిధానపురంలో సోమవారం రాత్రి చోరీ జరిగింది. గ్రామంలోని రోడ్డు పక్కన షేక్ నాగుల్ మీరాకు చెందిన జానీ చికెన్ సెంటర్‌లో చొరబడిన గుర్తుతెలియని వ్యక్తులు రూ.10 వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే, పక్కనే ఉన్న బెల్ట్‌షాపులో 15మద్యం సీసాలు సైతం చోరీ చేశారు. ఘటనపై బాధితులు మంగళవారం మధిర రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

అత్యాచారయత్నం కేసు నమోదు

చింతకాని: మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఒంటరి మహిళపై అదే గ్రామానికి చెందిన వ్యక్తి అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. బాధిత మహిళ భర్తతో విడిపోయి ఒంటరిగా జీవిస్తోంది. ఆమె మంగళవారం మామిడి కాయలు కోయడానికి కూలీకి వెళ్లగా, సదరు వ్యక్తి అత్యాచారానికి యత్నించాడు. ఈ సమయాన బాధితురాలు కేకలు వేయడంతో ఆయన పరారయ్యాడు. సదరు మహిళ ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ నాగుల్‌మీరా తెలిపారు.

రౌడీషీటర్‌పై పీడీ యాక్ట్

ఖమ్మంక్రైం: చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడుతున్న ఖమ్మంకు చెందిన రౌడీషీటర్ పేరల్లి ప్రవీణ్‌పై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు పోలీసు కమిషనర్ సునీల్‌దత్ తెలిపారు. భూకబ్జాలు చేయడమే కాక పలువురి నుంచి డబ్బు డిమాండ్ చేస్తున్న నేపథ్యాన పీడీ యాక్ట్ అమలుచేస్తూ చంచల్‌గూడలోని జైలుకు తరలించామని వెల్లడించారు. గతంలో ప్రవీణ్‌పై జిల్లాలో 30 కేసులు ఉండగా, బెయిల్‌పై బయటకు వచ్చినా తీరు మార్చుకోలేదని తెలిపారు.

తీర్థయాత్రలకు వెళ్తారా..?!

- ఐఆర్‌టీసీ ఆధ్వర్యాన రెండు ప్రత్యేక రైళ్లు
- ఖమ్మం మీదుగా వెళ్లనున్న ఒక రైలు

కొత్తగూడెంఅర్బన్: తీర్థయాత్రలకు వెళ్లే వారి సౌకర్యార్థం ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ జాయింట్ జనరల్ మేనేజర్ డీఎస్‌జీపీ కిశోర్ వెల్లడించారు. తెలుగు రాష్ట్రాల ప్రజల కోసం జూన్ 14 నుంచి జూలై 13వ తేదీ వరకు రెండు ప్యాకేజీలుగా హైదరాబాద్ నుంచి ఈ ప్రత్యేక రైళ్లు నడుస్తాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

మొదటి ప్యాకేజీ – గంగా రామాయణ పుణ్యక్షేత్ర యాత్ర

ఈ యాత్రలో (కాశీ)వారణాసి, అయోధ్య, నైమిశారణ్య, ప్రయాగ్‌రాజ్, శృంగవర్పూర్ ప్రాంతాల సందర్శన ఉంటుంది. జూన్ 14వ తేదీన ప్రారంభమై 22వ తేదీ వరకు కొనసాగే ఈ యాత్రలో ఒక్కొక్కరికి సాధారణ టికెట్ రూ.16,200, 3ఏసీ ధర రూ.26,500, 2ఏసీ ధర రూ.35 వేలుగా నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్, భువనగిరి, జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, డోర్నకల్, ఖమ్మం, మధిర, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం, పలాస, బరంపూర్, భువనేశ్వర్ మీదుగా సాగుతుంది.

రెండో ప్యాకేజీ– ఐదు జ్యోతిర్లింగాల యాత్ర

ఈ ప్యాకేజీలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, త్రయంబకేశ్వర్, భీంశంకర్, ఘృష్ణేశ్వర్, ఎల్లోరా, మోవ్, నాగ్పూర్ ప్రాంతాలు సందర్శించవచ్చు. జూలై 5వ తేదీన మొదలయ్యే యాత్ర 13వ తేదీ వరకు కొనసాగుతుంది. ఇందులో ఒక్కొక్కరికి సాధారణ టికెట్ రూ.14,700, 3ఏసీ రూ.22,900, 2ఏసీ ధర రూ.29,900గా నిర్ణయించారు. ఈ రైలు సికింద్రాబాద్, కామారెడ్డి, నిజామాబాద్, ధర్మాబాద్, నాందేడ్, ముద్ఖేడ్, పూర్ణ మీదుగా వెళ్తుంది.

ఇవీ సౌకర్యాలు

తీర్థయాత్రల కోసం ఏర్పాటు చేస్తున్న రైళ్లలో ప్రయాణించే వారికి హోటల్, ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం, వాటర్ బాటిల్, టూర్ ఎస్కార్ట్ సేవలు ఎలాంటి అదనపు సేవలు లేకుండా అందుతాయి. అలాగే, ప్రయాణ బీమా ఉంటుంది. రైల్వే స్టేషన్ నుంచి ఆలయాలకు ప్రయాణం ఉచితంగా ఏర్పాటు చేస్తారు. ప్రతీ రైలులో 718 మంది ప్రయాణికులకు అవకాశం కల్పిస్తూ, ప్రతీ 70 మందికి ఇద్దరు కోఆర్డినేటర్లను నియమిస్తారు. అలాగే, ప్రతీ కోచ్‌కు ఒక సెక్యూరిటీ గార్డ్, రైలులో సీసీ కెమెరాలతో భద్రత ఉంటుంది. టికెట్ల బుకింగ్ కోసం 97013 60701, 92810 30712, 92814 95845, 92810 30749, 92810 30750 నంబర్లలో సంప్రదించవచ్చు.

మావోల మృతదేహాలను బంధువులకు అప్పగించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

ఖమ్మంమయూరిసెంటర్: ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన నంబాల కేశవరావు సహా మావోయిస్టుల మృతదేహాలను బంధువులకు అప్పగించాలని వామపక్ష ప్రజా హక్కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శత్రుదేశాల సైనికులు యుద్ధంలో మరణిస్తే మృతదేహాలను వారిబంధువులకు అప్పగిస్తుండగా, మావోయిస్టుల విషయంలో అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. మావోలను సజీవంగా పట్టుకుని కాల్చి చంపినందుకే తాత్సారం చేస్తున్నారని తెలిపారు. కా గా, ఆపరేషన్ కగార్‌ను నిలిపివేసి శాంతి చర్చలు జరపాలని వారు డిమాండ్‌చేశారు. ఈ సమావేశంలో శాంతి సమన్వయ కమిటీ సభ్యుడు డాక్టర్ ఎంఎఫ్.గోపీనాథ్, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు బాగం హేమంతరావు, నున్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, దండి సురేష్, లక్ష్మీనారాయణ, కాకి భాస్కర్, ఐ.వీ.రమణారావు, రవిమారుత్, విజయ్, చిర్రా రవి, జానీమియా, ఎర్ర బాబు, గోవిందరావు, మాదినేని రమేష్, వై.విక్రమ్, జాన్సీ, ఖాసిం పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా


కల్లూరు: కల్లూరులో మంగళవారం ఇటుకల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ట్రాక్టర్‌పై ఉన్న కూలీలు వెంకట నాగలక్ష్మి, నాగమణి, రాధ తీవ్రంగా గాయపడగా ఆస్పత్రికి తరలించారు.

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ కన్నుమూత

- ఉపాధ్యాయ వృత్తి నుంచి ఎమ్మెల్యే వరకు ప్రస్థానం
- తొలినాళ్లలో సర్పంచ్, ఎంపీటీసీగా కూడా విజయం
- సీఎం రేవంత్, మాజీ సీఎం కేసీఆర్ సహా పలువురి సంతాపం


మదన్‌లాల్ (ఫైల్)

వైరా/రఘునాథపాలెం: వైరా మాజీ ఎమ్మెల్యే బానోత్ మదన్‌లాల్(63) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయనను కుటుంబీకులు హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో ఈనెల 23న చేర్పించారు. అక్కడ చికిత్స చేయిస్తుండగానే గుండెపోటు రావడంతో కన్నుమూశారు. ఆయన స్వగ్రామం రఘునాథపాలెం మండలం ఈర్లపూడి కాగా భార్య మంజుల, కుమారుడు మృగేందర్‌లాల్, కూతురు మనీషాలక్ష్మి ఉన్నారు. కుమారుడు తమిళనాడు(కోయంబత్తూరు) జీఎస్టీ కమిషనర్‌గా, కోడలు శ్వేత తమిళనాడు కేడర్‌లో జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. మూడు నెలల క్రితమే ఆయన సోదరుడు, ఏసీపీ జవహర్‌లాల్ ప్రమాదంలో మృతి చెందాడు. ఇప్పుడు మదన్‌లాల్ మృతితో విషాదం నెలకొంది.

ఉపాధ్యాయుడి నుంచి ఎమ్మెల్యే దాకా..

మదన్‌లాల్ ఈర్లపూడిలోని సామాన్య కుటుంబంలో జన్మించారు. 11 మంది సంతానంలో మదన్‌లాల్ మూడో వ్యక్తి కాగా, ప్రాథమిక విద్య డోర్నకల్ మండలం బలపాలలో, డిగ్రీ ఎస్‌ఆర్‌బీజీఎన్‌ఆర్ కళాశాలలో పూర్తిచేశారు. కళాశాల రోజుల్లో పీడీఎస్‌యూలో పనిచేసిన ఆయన.. 1989లో కామేపల్లి మండలం అబ్బాస్‌పురం ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పని చేశారు. కబడ్డీలో ప్రావీణ్యం ఉండడంతో అదే ఏడాది ఎస్‌ఐ పోస్టుకు ఎంపికైనా కేసుల కారణంగా ఉద్యోగం దక్కలేదు. ఆ తర్వాత రాజకీయాలపై ఆసక్తితో ఉపాధ్యాయ వృత్తికి రాజీనామా చేసి 1996 – 2001 వరకు ఈర్లపూడి సర్పంచ్‌గా పనిచేశారు. 2001 – 2006 వరకు ఆయన భార్య మంజుల సర్పంచ్‌గా కొనసాగగా, తిరిగి 2006లో మదన్‌లాల్ రెండోసారి సర్పంచ్‌గా, ఆపై కాంగ్రెస్ తరఫున ఎంపీటీసీగా విజయం సాధించారు. 2004లో ఇల్లెందు నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా కాంగ్రెస్ టికెట్ ఆశించినా దక్కలేదు. 2009లో ఏర్పాటైన వైరా(ఎస్టీ) నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశించినా ఫలితం లేక ఇండిపెండెంట్‌గా బరిలోకి దిగి 5వేల పైచిలుకు ఓట్లు సాధించారు. దివంగత సీఎం వైఎస్‌పై అభిమానంతో 2014లో నాటి ఎంపీ, ప్రస్తుత మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా వైఎస్సార్‌సీపీలో చేరి, వైరా నుంచి సీపీఎం మద్దతుతో ఎమ్మెల్యేగా గెలుపొందారు. కానీ ఏడాది తిరగకుండానే బీఆర్‌ఎస్(టీఆర్‌ఎస్)లో చేరగా, 2018, 2023 ఎన్నికల్లోనూ పోటీ చేసినా విజయం దక్కలేదు.


మదన్‌లాల్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ తదితరులు

పరామర్శించిన కేసీఆర్.. పలువురి నివాళి

మాజీ ఎమ్మెల్యే మదన్‌లాల్ మృతదేహాన్ని ఖమ్మం కవిరాజ్‌నగర్‌లోని నివాసగృహానికి తీసుకొచ్చారు. ఈమేరకు మాజీ సీఎం కేసీఆర్ మదన్‌లాల్ కుమారుడు మృగేందర్‌లాల్‌కు ఫోన్ చేసి ఓదార్చారు. అలాగే, సీఎం కేసీఆర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు. ఇక ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్, మాజీ ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చానాగేశ్వరరావు, కొండబాలతదితరులు మదన్‌లాల్ మృతదేహం వద్ద నివాళులర్పించారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు గడిపల్లి కవిత, బొర్రా రాజశేఖర్, సూతకాని జైపాల్, రాంపూడి రోశయ్య, పగడాల మంజుల, కూరాకుల నాగభూషణం, కమలరాజు, గుండాల కృష్ణ, నెల్లూరి కోటేశ్వరరావు, బీరెడ్డి నాగచంద్రారెడ్డి, నాగరాజు, సుబ్బారావు, నున్నా రవికుమార్, బాగం హేమంతరావు, దండి సురేష్, యర్రా బాబు నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. కాగా, మదన్‌లాల్ అంత్యక్రియలను బుధవారం స్వగ్రామమైన ఈర్లపూడిలో నిర్వహించనున్నట్లు ఆయన కుటుంబీకులు వెల్లడించారు.


మదన్‌లాల్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న వద్దిరాజు, పువ్వాడ తదితరులు


నివాళులర్పిస్తున్న నామ, సండ్ర తదితరులు